


ఆఫీసు మూసేయుడాని కింకా అరగంట టైమ్ ఉండనగానే కంగారు పడిపోతాడు సీతారాం. కాగితాలన్నీ సర్దేస్తాడు. అంతకు మునుపే అతని మనసు ఇంటికి చేరిపోతుంది. ముళ్ళ మీద కూర్చున్నట్లు ఆ మిగిలిన ముప్పై నిముషాలు కాదు, పద్దెనిమిది వందల యుగాలు ( సెకన్లు ) గడిపేసి ఇంటికి బయల్దేరి పోతాడు.

ఎందుకో ఆ కంగారు? ఏమిటో రోజా ఇంటి దగ్గర ఊరించే అంతపాటి పెద్ద విశేషం? అస లెందు కంత ఆత్రత సాయంత్రం అయిదు గంట లంటే?

అతను ఆఫీసులో చేరిన కొత్తల్లో, ఎవ్వరూ పట్టించుకోలేదు గాని, కొన్నాళ్ళకి అంతా కనిపెట్టే శారు సీతారాంకి, సాయంత్రం అయిదుకి ఉన్న సంబంధాన్ని. దాన్ని ఆడ, మగ మధ్య అక్రమ సంబంధ మంత విశేషంగా చెప్పుకోసాగేరు!!

"పెళ్ళయి నాలుగేళ్ళయినా ఇంకా ఎందుకోయ్ ఆ తొందర? ఏముంటుంది ఇంటి దగ్గర కొత్తగా? పెళ్ళయిన మొదటి రోజుల్లో నంటావా—ఓ. కె! కాని ఇద్దరు పిల్లలు పుట్టేక...హి హ్హి హ్హి ..." ఒక రోజు సెక్షన్ హెడ్ రాఘవయ్యగారు పిచ్చిగా అడిగేశారు. సీతారాం బదులు చెప్పలేదు.

## 'సత్యకృష్ణ'

వయసు మళ్ళేక, ఒంట్లో ఓపిక తగ్గేక సాధారణంగా చాలా మంది ఇలా మాట్లాడి సరదా పడతారని ఏదో సైకాలజీ పుస్తకంలో చదివింది గుర్తొచ్చింది సీతారాంకి. రాఘవయ్యగారు అలా ప్రవర్తించటానికి కారణం ముఖ్యంగా వయసు అన్న సిద్ధాంతంలో నమ్మకం ఉన్న వాడు సీతారాం. అందుకే ఆయన అలా మాట్లాడినా కోపం తెచ్చుకోలేదు. పైగా చిరునవ్వు కూడా విసర గలిగాడు! ఎదుటి వ్యక్తి పుండు మీద పుల్లతో పొడిచినట్లు వక్రంగా ప్రవర్తించినా నవ్వుతూ సహించగలగటం మానసికంగా బాగా ఎదిగిన వాడి లక్షణమే మరి!

మరోసారి కొలీగ్ శేఖర్ ఇదే విషయంలో తల దూర్చాడు. కాని పద్ధతిలో చిన్న మార్పు చూపించాడు.

"ఏమిటి, బాస్! ఈ రోజు నన్ను సినిమా తీసుకెళ్ళగుంటావా, నువ్వు తీసుకెళ్తావా? నీ ఇష్టం. ఇట్ జ్ అప్ టు యూ టు డిసైడ్. కాని ఏదో ఒకటి మాత్రం జరిగి తీరాల్సిందే. నువ్వు కాదనకూడదు. నా కివాళ మనసు బాగాలేదు." తెలివిగా ప్రారంభించాడు శేఖర్.

"అసలు నువ్వు సినిమా కెళ్ళని రోజుందా? ఏడాది కోసారి చూసేవాడిలా మాట్లాడతావేం? మరోసారి చూద్దాంలే. ఈ వేళ మాత్రం కుదరదు. నువ్వు అనవసరంగా బుర్ర వాడేసి నన్ను ఇరకాటంలో పెట్టకు!"

సీతారాం జవాబుతో ముసుగు తీసి దూరంగా విసిరేశాడు శేఖర్. అడగ దల్చినది సూటిగానే అడగటానికి నిశ్చయించుకున్నాడు.

"అది కాదు, బ్రదర్. నా కో చిన్న సందేహం. ఆఫీస్ వదలగానే ఎందు కలా పరిగెత్తుకు పోతావ్? ఇల్లే సర్వస్వం అన్నట్లు ఎందుకు నీ కా ఉరుకులు పరుగులు?! ఏ ముంటుంది స్వర్గం అక్కడ? రాత్రి పది వరకు నా కసలు ఇల్లు గుర్తుకే రాదంటే నమ్ము. ఎన్నాళ్ళుగానో ఈ నీ విషయం అడగా లనుకుంటున్నాను. మనిద్దరం క్లోజ్ ఫ్రెండ్స్. ఒకే ఈడు వాళ్ళం! నాతో కూడా చెప్పకూడనంత రహస్యమా?"

అతని ఆత్రత, ఆరాటం, ఆవేదన ఎందుకో అర్థం కాలేదు సీతారాంకి. 'పరాయి వాళ్ళ స్వంత విషయాలంటే ఎందు కంత ఆసక్తి ఈ ప్రజలకి' అనుకున్నాడు. వాళ్ళకేం వస్తుంది? లాభం లేకుండా ఏ పనీ చేయని ఈ జనం ఇలాంటి విషయాల్లో ఎందు కంత ఇంటరెస్ట్ చూపిస్తారు? వీటిలో ఒక్క ప్రశ్నక్కూడా సమాధానం దొరకలేదు అతనికి.

"ఏమో మరి! నాకే తెలియదు. నిజంగా" అనేసి కదిలిపోయాడు సీతారాం. అతని వెనక శేఖర్ పళ్ళు నూరేడు. కుడి గుప్పిటితో ఎడమ అరిచేతిలో కొట్టుకున్నాడు! నోట్లో ఏవేవో గొణుక్కున్నాడు.

తను టంచనుగా సాయంత్రం అయిదుకి గృహోన్ముఖు డయ్యే విషయంపై ఆఫీసులో అంతా చిత్రంగా కథలుగా చెప్పుకుంటున్నారని తెలియగానే కాన్షస్‌గా తయారయ్యాడు. ఈ సారి అతనికే అనుమాన మొచ్చింది. అన్నట్టు తన కెందు కంత ఇష్టం ఇల్లంటే?!

లక్ష్మి సంసార పక్షంగా, సామాన్యంగా ఉంటుందే కాని రంభ కాదు. కోరికలతో పిచ్చెక్కించేటంత కామ పిశాచి అసలే కాదు! రెండు గదుల వాటాలోనే సంసారం అంతా సర్దింది లక్ష్మి. కాబట్టి ఆఫీస్‌కన్నా విశాలంగానూ, నీట్‌గానూ ఉండే అవకాశం ఏమాత్రం లేదు. పిల్లలు అల్లరిచేయటం, అవసరమైతే తను రెండు తగిలించటం, ఇల్లొక సంతగా మారటం మామూలే. అలా బహు సామాన్యమైన తన ఇల్లంటే తన కెందు కంత ప్రీతి? అందరికీ అంతేనా, తనొక్కడే ఇలాగా?! ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. 'ఏమో మరి' అనుకున్నాడు.

కొన్ని ప్రశ్నలకు సమాధానా లుండవ్. కొన్ని భావాల గురించి చెప్పటానికి మామూలు మాటలు పనికిరావ్. ఆ అనుభవాల్ని, అనుభూతుల్ని వ్యక్తం

చేయటం సాధ్యంకాని పని.

ఆ రోజు నాలుగింటికి ప్యూన్ వచ్చి "అయ్యగారు మిమ్మల్ని రమ్మన్నారండి" అని చెప్పేడు.

సాధారణంగా గదిలోకి పిలవడు ఆఫీసర్. తను ఏదో తప్పు చేసి ఉంటాడు. ఇప్పుడేం చీవాట్లు తినాలో ఏమిటో అనుకుంటూ స్ప్రింగ్ డోర్‌పై మెల్లిగా తట్టేడు.

"మే ఐ కమిన్, సార్?" అని కూడా అన్నాడు వినపడీ వినిపించనట్లు, వినయంగా!

"కమిన్." లోపల్నించి అనుమతి వచ్చింది.

"కూర్చో."

ఆశ్చర్యపోయాడు సీతారాం. సంశయిస్తూండగా మళ్ళీ "కూర్చో" అన్నాడు బాస్.

"ప్రమోషన్ రాగానే విలువ పెరుగుతుంది కాబోలు! ప్లేటు మార్చేస్తున్నాడు ఆఫీసర్! ఒక వేళ నేను వ్రాసిన గ్రేడ్ వన్ పరీక్షలో సెలక్టయిన ట్లొచ్చిందా లెటర్?! అప్పుడు ఈ బాస్‌కి నేనే బాస్! గమ్మత్తుగా ఉంటుంది అలా జరిగితే? అయినా విషయం తెలుసుకోకుండా ఊరికే ఊహించేసుకుని ఆనందపడిపోవటం విజ్ఞుల లక్షణం కాదు" అను కున్నాడు సీతారాం. అన్నీ ప్రశ్నలే—అంతా అయో


# రెక్సోనా మీ చర్మాన్ని సంరక్షిస్తుంది...





# మృదువుగా మెరిసేలా ఉంచుతుంది

**రెక్సోనాలో ఉంది సహజసిద్ధమైన నాలుగు నూనెల సమ్మేళనం**

హపుషా (దేవదారు జాతి), లవంగ పట్ట, లవంగ, సరళం అనే ఈ నూనెలు మీ చర్మంలో ఊరే నూనె అంత సహజసిద్ధమైనవి. రెక్సోనాతో స్నానం చెయ్యండి—మీ చర్మం ఎలా ప్రకాశిస్తుందో మీరే చూసుకోండి. మీరెంతో ఇష్టపడే పరిమళాన్ని చర్మంపై నిలిపి గుబాళింపజేసే రెక్సోనా మీ చర్మ సంరక్షణ కోసం సహజమైన సాధనం.




# రెక్సోనా మీ చర్మ సౌందర్యం కోసం

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

లింటాస్-

మయం. బాస్ ఎదురుగా కుర్చీలో కూర్చున్న సీతారాం కాళ్ళు వణకటం ప్రారంభించాయి. నెర్వస్‌గా ఫీలయ్యాడు.

"సారీ, మిస్టర్ సీతారాం. నీ మీద నాకెంతో సింపతీ ఉన్నా ఈ విషయంలో నే నేమీ చేయలేను. మీ టెంపరరీ పోస్టులన్నీ ఊస్టు చేసినట్లు ఆర్డర్స్ వచ్చాయి."

అతని చెవుల్ని అతనే నమ్మలేకపోయాడు. అతని కాళ్ళ క్రింద భూమి అమాంతంగా తల్లక్రిందులైనట్లు అనిపించింది. లేచి నిలబడ్డాడు. కళ్ళు తిరుగుతున్న ట్లనిపించింది.

"సార్, నాకు నాలుగేళ్ళ సర్వీసుందండి. మీ రెప్పుడూ నా గురించి బేడ్ రిమార్క్స్ కూడా వ్రాయలేదు. . ."

"దే ఆర్ ఆల్ యూస్‌లెస్, మై బాయ్! ఇక్కడ ఆఫీస్‌లో నువ్వు బాగా పనిచేస్తావని నాకు తెలుసు. కా౹ నేనేం చెయ్యగలను? నీ కిచ్చిన అప్పాయింట్‌మెంట్ ఆర్డర్సులో 'మే బి టెర్మినేటెడ్' అని కూడా ఉంది—గుర్తు తెచ్చుకో. 'అంటే మాకు అవసరం లేనప్పుడు మిమ్మల్ని ఉద్యోగాల్లోంచి పీకేస్తాం' అని అర్థం. మంచి వాగ్దానాల మాట ఎలా ఉన్నా ఈ విషయంలో తను మాట నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నట్లుంది మన ప్రభుత్వం! ఇక మానవతావాదం, న్యాయం అంటావా? అలాంటి పదాల కిక్కడ స్థానం లేదు. ప్రభుత్వ రథ చక్రాల క్రింద నలిగిపోయే నీలాంటి వాళ్ళని ఆదుకునే నాథుడు లేడు. నిజానికి ఆఫీసర్‌గా నేను ఇలా మాట్లాడకూడదు ప్రభుత్వం గురించి. అలా చేస్తే తిరుగుబాటుదార్ల క్రింద జమకట్టేసి ముద్రవేసేస్తారు. ఈ మాటలే బయట నేను గనుక చెప్పి ఉంటే ఈ పాటికి నా సస్పెన్షన్ ఆర్డర్స్ టైప్ అయిపోయి ఉండును. నీ పరిస్థితి నేను అర్థం చేసుకోగలను. కాని ఏం చేయగలను—చెప్పు? ఐ కెన్ ఒన్లీ విష్ యూ ఆల్ ది బెస్ట్." తల వంచుకున్నాడు బాస్—ఆయ నేదో తప్పు చేసినట్లు.

"థాంక్యూ, సార్." శక్తినంతా కూడగట్టుకుంటే గాని ఆ రెండు మాటలూ బయటికి పెగిలి రాలేదు.

బాస్ గదిలోంచి బయటికి రాగానే హాల్లో అంతా పని మానేసి ఎదురు చూస్తున్నారు న్యూస్ కోసం.

సెక్షన్ హెడ్ రాఘవయ్య గారి దగ్గరకు నడిచాడు.

"ఏమోయ్, ఏమిటి సంగతి? ఎందు కట చివాట్లు? ఏమిటో వాటి వివరాలు?!" వ్యంగ్యం, వెట కారం, హేళన లాంటి వాటినన్నింటినీ నింపి పలికేడు.

"చివాట్లు కాదు, సార్, నా ఉద్యోగం పోయింది. టెంపరరీ పోస్టు లన్నీ ఊస్టు చేసినట్లు ఆర్డర్స్ వచ్చాయట."

"ఇక అయిదుకోసం ఎదురు చూడక్కర్లే దన్న మాట! అనుక్షణం ఆలి ముందే కూర్చుని గడిపేయచ్చు! నిక్షేపంగా కడుపు నిండిపోతుంది!! మా మంచి ఛాన్సు కొట్టేసేవోయ్!!" మంచి చెడ్డల్ని మరిచాడు రాఘవయ్య. వయసుకు తగినట్లుగా ప్రవర్తించలేకపోయాడు. సానుభూతి చూపించవలసిన సమయాన్ని మాటిపోటి మాటలతో దెప్పి



పొడవటానికి అవకాశంగా వాడుకున్నాడు. మనసు లేని మనిషిగా ప్రవర్తించాడు.

దమ్ములుంటే అన్నీ సవ్యంగా ఉన్న వాడిని, హాయిగా ఉన్నవాడిని ఏడిపించాలి, వెక్కిరించాలి, వేళాకోళం చేయాలి. అంతేగాని, విధి వంచితుడై, పరిస్థితుల చేతుల్లో చావుదెబ్బ తిని, కొన ఊపిరితో ఉన్న వాడిని మాటలతో చిత్రహింస చేయటం మానవత్వం కాదు. అలా చేసే వాళ్ళని పశువులతో పోల్చితే అవి నిరాకరిస్తాయ్! పోనీ రాక్షసులతో పోలిస్తే వాళ్ళు దండయాత్ర కొస్తారు వాళ్ళని అవమానపరిచినందుకు! అంతటి అధములు మరి ఏ జాతికి చెందేటట్టు? వాళ్ళకి జన్మని ప్రసాదించిన సృష్టికర్తకు సైతం ఇదొక జటిల సమస్య.

రాఘవయ్య వైపు అదోలా చూశాడు సీతారాం. పురుగును చూసినట్లు చూశాడు. విసురుగా ఆఫీస్ నుండి బయటికి నడిచాడు. టిఫిన్ బాక్స్ తీసుకోలేదు. సీటుని, కాగితాలని అప్పగించే బాధ్యతల్ని విస్మరించాడు.

సాయంత్రమయినా సరే, మిట్ట మధ్యాహ్నంలాగా ఉంది బయట. ఎండ దిమండిపోతోం. సీతారాం వడగాడ్పుల్ని ధిక్కరించి, వీథుల వెంట తిరిగాడు. అతనుంటున్న వీథి మినహా అన్ని వీథుల్లోనూ తిరిగేడు. బాగా పని ఉన్న వాడిలా కంగారుగా అటూ ఇటూ తిరిగాడు పనిలేని సీతారాం, పని పోయిన సీతారాం. ఏదో అమూల్యమయిన వస్తువుని పోగొట్టుకున్న వాడిలా, దానికోసం గాలిస్తున్న వాడిలా, పిచ్చి వాడిలా తిరిగేడు.

సూర్యుడు పూర్తిగా అలిసిపోయాక సాయంత్రం రాత్రిగా మారింది.

అదొక నిండు పున్నమి రాత్రి.

సూర్యుడి ఆగ్రహానికి గురయిన ప్రపంచానికి సాధ్యమైనంత చల్లదనాన్ని ప్రసాదించటానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తోంది చంద్రబింబం. ఆ తెల్లని వెన్నెల్లో ప్రకృతి కొత్త అందాల్ని సంతరించుకున్నది.

అంత అందమైన వాతావరణానికి భిన్నంగా

# సరళ గృహ వైద్యము

రచన: ఆర్. సుబ్బారావు, M.B.B.S.

ఇందు 194 వ్యాధులకు ఇంటియందు ఆకుకూరలు, కాయగూరలు, దుంపకూరలు, పువ్వులు, పండ్లు, సుగంధద్రవ్యాలు, ద్రవపదార్థముల నుండి ఇంటిలోనే తయారు చేసుకొని వైద్యము చేసుకొను పద్ధతులు వివరించబడినవి. తెలుగులో ప్రతి ఒక్కరికి తెలిసే విధముగా వ్రాయబడినది. ప్రతి ఇంట వుండదగ్గ పుస్తకం.

రు. 12 లు మనియార్డరు ద్వారా పంపిన యెడల రిజిస్టర్డు డెలివరీలో పంపబడును.

పంచాయితీ ఎయిడ్సు

10-7-40, ఫోర్టుగేట్, రాజమండ్రి-533101.




క్రొత్త సై-బాన్* లోషన్ వాడండి

రాత్రికి రాత్రే పేలనుండి విమోచనము పొందండి!

- గుణవంతమైనది
- సురక్షితమైనది
- ఆహ్లాదకరమైన సువాసన గలది
- జిడ్డు లేనిది

Lederle

* అమెరికన్ సయానమిడ్ కంపెనీవారి రిజిష్టర్డ్ ట్రేడ్ మార్క్

Sista's-CY-90-Tel/78


సిలిమబ్బులు దట్టంగా కమ్ముకున్నాయి సీతారాం హృదయం పైన. ఆ రాత్రి అతనికి అమావాస్య. అతన్ని నమ్ముకున్న భార్యలక్ష్మికి, వాళ్ళిద్దరి వల్ల ఈ లోకంలోకి ప్రవేశించిన మూడేళ్ళ వాసుకి, పది నెలల బాబీకి కూడా అదొక కాళ రాత్రి.

పార్కులో సిమెంటు బల్ల మీద కూర్చున్నాడు సీతారాం. అతనికి ఏం చేయాలో తెలియటం లేదు. ఏం చేయకూడదో అంతకన్నా తెలియటంలేదు.

"వార్తలు చదువుతున్నది ... " మున్సిపాలిటీ రేడియో గొంతు చించుకుంటోంది. ఆసక్తి లేక పోయినా, బిగ్గరగా వినవస్తున్న వార్తలు దౌర్జన్యంగా సీతారాం చెవుల్లోకి ప్రవేశించాయ్.

"వచ్చే పది సంవత్సరాలలో నిరుద్యోగ సమస్యను రూపుమాపుతారని..." బిగ్గరగా నవ్వేడు సీతారాం. ఈ వార్త విని. అతని ప్రక్క నెవ్వరూ లేరు. ఉండి ఉంటే అతని నవ్వు చూసి పిచ్చివా డనుకుని పరుగు లంఘించి ఉండేవారు!

'మిలియన్ డాలర్ జోకు' లాంటి పోమిని ఇచ్చిన మంత్రి గారి దగ్గర కెళ్ళి కొన్ని ప్రశ్న లడగా లనిపించింది అతనికి మనసులో. "ఇదే చెప్పదంటు వార్త ఇంకాస్త వివరంగా రేపు పేపర్లో సిద్ధం!! టైమ్ వేస్ట్ అవటం తప్ప కొత్తగా తెలుసుకొనేది ఏమీ కనిపించటం లేదు న్యూస్ పేపర్లో. అందుకే పేపర్ తెప్పించటం మానేశాను. రిటైరయినవాళ్ళకి, పనిలేనివాళ్ళకి తప్ప అవి శుద్ధ దండగ..." కాస్సేపు అతని మనసు న్యూస్ పేపర్స్‌ని విమర్శించింది. అంతలోనే అతని భావోద్వేదానికి ఆనకట్ట పడింది. తనూ ఒక నిరుద్యోగినని గుర్తొచ్చింది.

"నీ కర్తవ్యం ఏమిటో చెప్పు? అలా పార్కులో బల్లమీద కూర్చుంటే సమస్యలు వాటంత టవే పరిష్కారమై పోతా యనుకుంటున్నావా?" అని నిలదీసి ప్రశ్నించింది అంతరాత్మ.

"ఆఖరికి నా చెప్పుచేతల్లో ఉండే అంతరాత్మకి కూడా లోకువై పోయావన్న మాట ఈ నాడు ఉద్యోగం ఊడిపోగానే!" అనుకున్నాడు.

అతని బుర్ర తిరిగి వర్రీ కావటం మొదలు పెట్టింది—అదేదో పెద్ద పనిలాగా!

తీరం తెలియని మహా సముద్రంలో చుక్కాని లేని పడవ అతని ఆలోచనల తీరు. అమావాస్య నాటి నిశీథిలో పయనిస్తున్న గ్రుడ్డి బాటసారి అతను. పాపం! గమ్య మడిగితే ఏమని చెప్పగలడు?

మళ్ళీ ఆలోచనలు.

"జీతం తీసుకున్నప్పు డున్న ఆనందం మర్నాడు ఆ సమయం వరకూ నిలవదు. ఏ గద్ద వాటా ఆ గద్ద తన్నుకుపోగా, పదో, పాతికో తప్ప మిగలదు, మిగిలిన ఇరవై తొమ్మిది రోజులు గడపటానికి! మళ్ళీ అప్పులు. మళ్ళీ తీర్చడాలు. జీతం వచ్చిన నాడే తట్టుకోలేని జీవితాన్ని, జవాన్ని నిరుద్యోగిగా ఎలా భరించటం?

ఇంటాయనకి ఉద్యోగం పోయిందని తెలిస్తే ముం దిల్లు ఖాళీ చేయమంటాడు. మూడు నెలల అడ్వాన్సు ఇచ్చి క్రొత్త ఇల్లు తీసుకునే స్థితిలో లేదు తన జేబు.

నేను, లక్ష్మి పోనీ కాఫీ మానేయ వచ్చు. కనీసం పిల్లలకయినా పాలు ఇవ్వాలిగా. దాని కయినా నెలకి

ముప్పై కి తక్కువకాదు. పాలవాడు మాత్రం డబ్బు అడక్కుండా పోయటానికి వాడి కేమన్నా పిస్తేట్లున్నాయా? మరి పాలు మానేస్తే ఎలా?

పచారీ కొట్లో ఇప్పటికే బాకీ వందకి పైన అయింది. ఉద్యోగం ఊడినట్లు తెలిస్తే క్రొత్తగా పైసా సరుకైనా ఇవ్వడు సరికదా, పాత బాకీకోసం రోజుకి నాలుగు సార్లు మనుషుల్ని పంపిస్తాడు. మూడు రోజులు చూసి కుండా మండా బయటికి విసిరేస్తాడు. అది ఖాయం.

పోనీ కొన్ని రోజులు ఉద్యోగం దొరికే వరకూ అప్పులు చేస్తే? ఐడియా బాగానే ఉంది గాని, ఎవ డిస్తాడు నిరుద్యోగికి అప్పు? తిరిగి తీరుస్తానని వాళ్ళకి గ్యారంటీ ఏమిటి? మాట మీద నమ్మకం! మనుష్యుల మీదనే నమ్మకం లేదు మనుష్యులకి ఈ రోజుల్లో. ఇక వాళ్ళ మాటలకేం విలువ నిస్తారు?! ఐపీ పెట్టిన మహానుభావుడు అప్పుకు బయల్దేరితే? నవ్వరూ?! అలాగే ఉంటుంది ఇంచుమించు నేను స్నేహితుల్ని అప్పు అడిగితే.

ఆదుకోటానికి లక్ష్మి తరపున గాని, నా తరపున గాని ఎవ్వరూ లేరు.

బ్రహ్మచారిగా ఉండి ఉంటే ఎలాగయినా బత కొచ్చు. ఏమయినా చేయొచ్చు. ఎన్ని పరీక్షలనయినా భరించవచ్చు. చదివిన డిగ్రీ సంగతి మరిచిపోయి ఆఖరుకి ఏదో ఒక హోటల్లో సర్వర్‌గా చేరిపోతే చాలు. వెధవ పొట్ట బతికిపోతుంది. జీవం నిలుస్తుంది. జీవితంలో మరో మంచి మలుపుకోసం ఆశగా ఎదురుచూస్తూ బ్రతకొచ్చు. పెళ్ళాం పిల్ల లుండగా అది సాధ్యం కాదు. అన్యాయంగా బామ్మ ఆ అవకాశాన్ని నాకు దూరం చేసింది బలవంతంగా.” రెండేళ్ళ క్రితం చనిపోయినఅతని బామ్మ మీద కోపం వచ్చింది సీతారాంకి.

చిన్నప్పుడే తలితండ్రుల్ని పోగొట్టుకున్నాడు సీతారాం. అతనికి మిగిలిన ఆస్తి, ఆధారం ఒక్క బామ్మ మాత్రమే. ఒక పెద్ద కొంపలో వంట పనికి కుదిరి అతన్ని పెంచింది. పెద్ద చేసింది. చివరికి సీతారాంని ఒక పట్టభద్రుడ్ని చేసింది. ఆమె నాలుక మంచిది—అందుకే ఎవర్ని ప్రాధేపాయపడి అడిగినా కాదనలేక పోయేవారు. తోచిన సహాయం చేసేవారు.

అతనికి ఒక టెంపరరీ ఉద్యోగం రాగానే మనవడు కలెక్టరయి పోయినట్లు మురిసిపోయింది. వెంటనే ‘గంతకు తగ్గ బొంత’ లాంటి సంబంధాన్ని కుది ర్చింది. ఆ పిల్లకి కూడా ముందూ వెనకా లేరట. “ఉద్యోగం ఖాయం కానిదే ఎందుకు, బామ్మా, పెళ్ళి?”అన్నాడు సీతారాం.

“అదే అవుతుంది లేరా, వెర్రి నాయనా! ఒక్కో ఇల్లాలు ఇంట్లో కాలు పెడితే సిరి నట్టింట్లో నాట్యం చేస్తుందిటరా, వెంగళాయీ. ఆ పిల్ల ముఖంలో ఆ కళ కనబడు తోందిరా. అచ్చం రఘు ణయ్య మేష్టారి పోలిక! తండ్రి పోలికున్న ఆడపిల్ల అదృష్టవంతురాలురా, తండ్రీ! పాపంఆయన పోయారు కానీ, ఉండి ఉంటే పెళ్ళి కూడా ఘనంగానే చేసి ఉండును” అంది బామ్మ. ఆవిడ నమ్మకాలకి వంత పాడలేదు సీతారాం. ఆవిడ ఎంత బతిమాలినా కొరుకు పడలేదు.


# 78 నవలా డైమండ్స్...

ఆమె సంభాషణలు మనిశిత బాణాలు.
ఆమె వాక్యాలు అభిమాన పాఠకులకు వేదవాక్యాలు.

ఆమె కథాకథనం సుధామధురం.
ఆమె వ్రాసే ప్రతి కథ...
ప్రయోజనాత్మకమూ, ప్రయోగాత్మకము.

ఆంధ్ర పాఠకులకామె అభిమాన రచయిత్రేకాదు,
ఆరాధ్య రచయిత్రి కూడా!

అందుకే ఆమెకామే పోటి.
ఆమెతో మరొకరికి పొంతనలేదు, పోలికాలేదు.

ఆమే.....

శ్రీమతి యద్దనపూడి
సులోచనారాణి

ఆమె నవలా హారంలో
మణి పూసలు.

కీర్తికిరీటాలు... 15·00
ప్రేమలేఖలు... 12·00
పార్థు......... 10·00

78
నవలాడైమండ్స్
రాధాకృష్ణ 13·00
సంసారరథం 9·00

క్వాలిటీ పబ్లిషర్స్
రామమందిరం వీధి, విజయవాడ-520002.

Bachi



GO BRIGHT WITH SANKYO DYNAMO LIGHT

GO BRIGHT WITH SANKYO DYNAMO LIGHT

Sankyo

ఉజ్వలమైన కాంతి కోసం
ఆపదలేని
పనితనం
దీర్ఘకాలం
మన్నిక
శాన్క్యొయో
సైకిల్
డైనమో లైటు



12 వాట్లులూ, 6 వాట్లులూ
అత్యంత త్వరితగతిలో అమ్ముడు పోయు లైటు
శాన్క్యొయో డైనమో లైటు
తయారు చేయువారు—
IJI ఇండో జపనీస్
ఇండస్ట్రీస్ లిమిటెడ్
14, కెనాల్ స్ట్రీటు, కలకత్తా, ఇండియా.
మార్కెట్టు చేయువారు—
నిగమ్ బ్రదర్స్, 150, ధరమ్‌తల్లా స్ట్రీట్,
కలకత్తా-700 013, ఫోను : 24-4135/36.

GO BRIGHT WITH SANKYO DYNAMO LIGHT

GO BRIGHT WITH SANKYO DYNAMO LIGHT

అంతటితో ఆవిడ పాతుపతాస్త్రం వాడింది. "అష్టకష్టాలూ పడి పెంచి, పెద్దచేసినందుకు నీకు వీస మెత్తయినా విశ్వాసం లేదురా. నా చిన్న కోరికనే కాదంటివి. నీ కిప్పుడు బామ్మ అవసరం ఏం ఉంది? రెక్క లొచ్చినాయ్. అందుకే ఆ పొగరు!" అంటూ ఏడ్చింది. అయినా సీతారాం లొంగలేదు.

బామ్మ రెండు పూటలు అన్నం ముట్టలేదు. ఈ నిరాహార దీక్ష విషయం ఇరుగూ పొరుగూ ఇళ్ళకి చేరింది. "ముసలిదాన్నలా ఏడిపించి ఉసురు పోసుకోకు. పాపం కూడాను!" అని గడ్డి పెట్టి వెళ్ళారు ఇరుగూ, పొరుగూ కలిసి. అంతే! వారానికల్లా ఒక ఇంటివాడయి పోయాడు... లక్ష్మికి మొగుడయ్యాడు.

"ఇదేం విడ్డూరంరా? నాలుగేళ్ళ వరకూ పిల్లలొద్దు అన్నావుట దానితో! ఆ పిల్లని ఆసుపత్రికి రమ్మనమని గొడవ పెడుతున్నావట! కొన్నాళ్ళ పాటు పిల్లలు పుట్టకుండా ఉండటానికి అదేదో ..."

"ఎవరు చెప్పారు నీకు?"

"నువ్వెలాగూ చెప్పకుంటివి! వేరే ఎవరున్నారు చెప్పటానికి ఈ కొంపలో నీ పెళ్ళాం తప్ప. లక్షణంగా గంపెడు పిల్లల్ని కని, పెంచక అవేం అప్రాచ్యపు బుద్ధులురా? నారుపోసినవాడు నీరుమాత్రం పోయడా అంతా విడ్డూరంగాని? వాడి రాతకి అడ్డు వెళ్ళితే మంచిది కాదురా, చంటీ! నా మాట విను. అయినా ఈ కాలపు పిల్లలకి అస్సలు చెప్పలేక పోతున్నాం. అన్నీ మీకే తెలుసు ననుకుంటారు." చిన్న సైజు లెక్చరిచ్చింది ముసలావిడ.

"మీ పెద్దాళ్ళు మాత్రం?....కొన్ని మాకు తెలియక పోవచ్చునని ఒప్పుకోగలరా?"

ఆమె ముక్కుమీద వేలేసుకోవటం, ఆ తర్వాత బుగ్గ నొక్కుకోవటం లాంటి చేష్టలు చూడకుండా బయటికి వెళ్ళిపోయాడు సీతారాం.

"ముసలావిడతో ఎందుకు చెప్పావ్?" ఆ రాత్రి చెయ్యి కడుక్కుంటూ అడిగాడు లక్ష్మిని, భోజనాలయ్యాక.

"నా అంతట నేనే చెప్పలేదు. ఇంకా నీళ్ళోసుకోలేదేమిటే, పిల్లా, అని రోజూ అంటున్నారు. ఆఖరికి ఈ వేళ మధ్యాహ్నం అమ్మలక్కలంతా ఉండగా వాళ్ళ మధ్యన నిలబెట్టి మరీ అడిగారు. నాకు సిగ్గూ, ఏడు పూ వచ్చాయి. ఆ తర్వాత చెప్పాను—నేను బాధ్యురాలిని కాదని." దటాల్స్ యువరానర్ అన్నట్టు చెప్పటం ఆపింది లక్ష్మి.

బామ్మగారి మరో అలక పాన్పు, మరో నిరాహార దీక్ష ఫలితంగా సీతారాం రెండోసారి బామ్మ చేతుల్లో ఓడిపోయాడు. ఏడాది కల్లా వాసూ, తర్వాత వాడికి జతగా బాబిగాడు పుట్టేరు.

చనిపోయి నావిడ మీద చెప్పలేనంత కోపం వచ్చింది సీతారాంకి.

సిమెంటు బల్లమీద కర్రతో కొట్టిన శబ్దమయింది. సీతారాం ఉలిక్కిపడ్డాడు. ఆలోచనల నించి, గతం లోంచి ఈ లోకంలోకి—వర్తమానంలోకి రాక తప్పలేదు.

"పది గంటలు కొట్టేరు,బాబూ—దూది మిల్లులో. రూలు పెకారం ఎనిమిదికే మీరు బయటి కెళ్ళిపోవాలి, బాబూ."

సీతారాం సమాధానం చెప్పలేదు, లేచి నిలబడ్డాడు. 'నువ్వేటు ఎల్లాలో నా కనవసరం. కాని ఇక్కడ్నించి ఎల్లి తీరాల్సిందే' అన్నట్లు నిలబడ్డాడు పార్కు వాచ్‌మన్. మరో సారి అతని హెచ్చరిక తట్టుకునే స్థితిలో లేని సీతారాం అక్కడి నుండి కదిలి బయటికి నడిచాడు.

మెయిన్ రోడ్ మీద నడుస్తున్న సీతారాం బుర్రలో ఒక ఆలోచన మెరిసింది. ఏదో గుర్తొచ్చింది. "అయితే పేపర్ చదవటం పూర్తిగా వేస్టు కాదన్న మాట!' అనుకున్నాడు. వారానికోసారి పేపర్లో కనబడే వార్త తన విషయంలో నిజం కాబోతోందన్న మాట! దాని ప్రకారం ఇంట్లో అందరికీ విషం పెట్టి, తనూ కాస్త తిని సమస్యని పరిష్కరించాలి. వాట్ ఎ వెరీ బాడ్ ఐడియా!—అనుకున్నాడు.

కాని అంతలోనే అతని అంతరాత్మ ఎదురు తిరిగింది— ప్రభుత్వ పక్షంలో ఉండి, ప్రభుత్వాన్నే దుయ్యబట్టిన రాజకీయ నాయకుడిలా!

"వాళ్ళనందరినీ చంపటానికి నీకేం అధికారం ఉంది?" అని కాలర్ పట్టుకుని అడిగింది అతన్ని.

సమాధానం చెప్పలేని సీతారాం—"అవును, నాకేం అధికారం ఉంది?" అనుకున్నాడు.

అంతలో మురుగు కాల్వమీదున్న వంతెన మీదికి చేరేడు సీతారాం. క్రిందికి చూశాడు. ఊళ్ళోని మురుగునంతనీ సముద్రంలోకి తీసుకుపోతోంది. చిన్న నదిలా ఉంది ఆ పెద్ద మురుగు కాల్వ.

అటూ ఇటూ చూశాడు. ఒక ముష్టివాడు వంతెన వైపు నడిచి వస్తున్నాడు. అంతకు మించి జన సంచారం లేదు ఆ ప్రదేశంలో. "ఈ ముష్టి వెధవ వెళ్ళిపోగానే క్రిందికి దూకేయొచ్చు' అనుకున్నాడు సీతారాం.

అతని మనసులో రేగిన తుఫాను సద్దుమణిగింది. మనసు ప్రశాంతంగా ఉంది. అతని కంతటి మనశ్శాంతి నిచ్చింది అతను తీసుకున్న నిర్ణయం.

అంతలోనే ఆ బిచ్చగాడు వంతెన మీదకు వచ్చాడు.

"ఏటి, బాబూ, ఈ యాలప్పుడీడ నిలుసున్నారు?" అతని పలకరింపుకి వెనక్కి తిరిగాడు సీతారాం.

"నా ఇష్టం? ఎందుకు నిలబడ కూడదు? మధ్య నీ కెందుకు? ఇది నీ సొంతమా?" పార్కులో మాట్లాడలేని సీతారాం బిచ్చగాడిపై అన్యాయంగా, దురుసుగా విరుచుకుపడ్డాడు.

"అది కాదు, బాబూ! రేత్రేళ ఈడ దెయ్యాలు తిరుగు తుంటాయి, బాబూ. అందుకని సీకటడ్డాక మడుసు లిక్కడికి రారండి. అందుకని ..."

"మరి నువ్వెందుకు వెళ్తున్నట్టు ఈ దారిని?" తెలియకుండానే వాదానికి దిగేడు వాడితో.

"మాతో మీకు సాపత్తివేటి, బాబూ? మా బతుక్కి ఇలువేటుంటది, బాబూ? మాలాటోల్లని సూత్తే దెయ్యాలే జడుత్తాయండి! మేం ఏటయిపోయినా పెపంచకానికి లోటు రాదు బాబుగారూ!" మరి మీ సంగతేమిటి అన్నట్లు చూశాడు ముష్టివాడు.

"నా పరిస్థితి కూడా అంతే. నా బ్రతుక్కి కూడా విలువ లేదు. ఉపయోగం లేదు. నే నెందు కింకా బ్రతకాలో నాకు తెలియలేదు. ఎలా బ్రతకాలో

వేలకు వేలు కోరుకొను
రంభ
మరికొళుందు సెంటు
Ramba
MARIKOLUNDU SCENT
రంభ కాస్మాటిక్సు,
అడయారు, మద్రాసు-20.

ఉచితము! ఉచితము
తెల్ల మచ్చలు
మా చికిత్స ప్రారంభించగానే మచ్చలు రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఏంత పనిచేస్తుందో చూడండి. రోగ వివరాలు వ్రాసి ఉచితంగా ఒక ప్యాకెట్ మందు పొందండి.
LALIT AYURVEDIC PHARMACY (AW)
P.O Katri Sarai (GAYA)



ఆంధ్రప్రదేశ్ ల ఏజన్సీలు
ఇవ్వబడుచున్నవి
VIJAYA/Masula

27-9-78




అర్థం కాలేదు. అందుకే ఆత్మహత్య చేసుకోవా లను కున్నాను, ఈ వంతెన మీాద నుంచి దూకి. అంతలో నువ్వొచ్చావ్. ఏం? ఆశ్చర్యంగా ఉందా ఈ మురుగు కాలవను ఎన్నుకున్నందుకు? ఒక అంద మైన స్థలాన్ని, ఒక నాజూకైన మార్గాన్ని ఆత్మ హత్య కొరకు వెతికే ఓపిక లేదు నా దగ్గర. నాకు ఈత రాదు. అందుచేత చచ్చిపోవడానికిది చాలు. ఇక మురుగు నీరంటావా? అయినా పిచ్చిగాని, చచ్చే ముందు మురుగు, కుళ్ళు అన్న ఆలోచనెందుకు? ఏమంటావ్?'' బాగా పరిచయమున్న ఒక ఆప్తునితో చెప్పినట్టు చెప్పేశాడు సీతారాం మనసులోని విషయాలన్నీ.

"అయ్యేం మాటలు, బాబుగారూ! మీా రెయ్యేళ్ళు సల్లగుండాల! పరీచ్చలో పేలయిపోతే మల్లీసారి కట బడి సదవాలి గాని సచ్చిపోట మేటి బాబూ?''

"నాకు పట్టా వచ్చింది. ఇద్దరుపిల్లల తండ్రిని."

"మీారు సిన్నగా అగపడితే సదూకుంటన్నారనుకున్నా, బాబూ'' తన ఊహా శక్తిని సమర్థించుకున్నాడు.

'మీారు మీా వయసు కన్నా చిన్న వారులా కనిపిస్తారంటే బెలూన్‌లా అవ్వని వారుండరు భూమిామ్మీద! కాని సీతారాం వైరాగ్యపు ముసుగులో ఉండటం వలన వాడి కాంప్లిమెంట్‌కి మురిసిపోలేదు.

"సంసారం అన్నాక సిన్న సిన్న కీసులాటలు వత్తా ఉంటాయండి. సరుదుకు పోవాలగాని, పేనాలు తీసుకుంటా రేటి, బాబూ, ఎవరన్నా? అంటూ పైన కప్పుకున్న పంచెను సరిచేసుకున్నాకు బిచ్చగాడు.

"మా ఇద్దరి మధ్య ఏం గొడవల్లేవు." కోర్టులో జడ్జిగారి ముందు బోనులో నిలబడి సమాధానం చెప్పినట్లు చెప్పాడు సీతారాం.

అంత నిలదీసి అడిగే అధికారం తనకి ఎవరిచ్చారో తెలియదు బిచ్చగాడికి. అత నడిగే ప్రతి ప్రశ్నకి తను ఎందుకు సమాధానం చెబుతున్నాడో సీతారాంకి తెలియదు.

"అయితే మరేమిటి. బాబూ? అన్నీ బాగుండి ఎందుకనుకున్నారు, బాబూ, సచ్చిపోవాలని?' అప్పటికి తన ఊహాశక్తి మీాద నమ్మకం సడలి సూటిగా ప్రశ్నించాడు బిచ్చగాడు.

"నీ కెందుకు చెప్పా లసలు? నీకూ నాకూ ఏమిటి సంబంధం? నువ్వడిగే ప్రతి దానికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు నాకు. నీ దారిన నువ్వు పో. నా దారిన నే పోతా." ఒక బిచ్చగాడు తనను నిలదీసి అడుగుతున్నట్టు, ప్రశ్నిస్తున్నట్టు అప్పటికి అనిపించింది కాబోలు! సీతారాం అతనిపై విరుచుకు పడ్డాడు.

కాస్సేపు మాట్లాడలేదు బిచ్చగాడు.

"ఇప్పటిదాకా మన బందం ఏటని సెప్పేరు, బాబూ, ఇసయాలన్నీ? బాదల్లో ఉన్న మడిసని తెలిశాక ముందు కెల్లలేకపోయాను, బాబూ! నా లోపట జీవుడికి అదో జబ్బు, బాబు గారూ! ఏం సెయ్యమంటారు? చమించండి..."

అతని మాటలు పూర్తికాక ముందే పూర్తిగా కరిగిపోయాడు సీతారాం. మోటుగా ప్రవర్తించి నందుకు తనని తానే తిట్టుకున్నాడు. అసలు అంత

కటువుగా మాట్లాడ్డం అతని నైజం కాదు. ప్రాణం విసిగి ఉన్న మీదట అలా విదిలించేశాడు.

"నా ఉద్యోగం పోయింది. పాలుగేళ్ళు పనిచేశాక, పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కన్నాక ఈ రోజు నా ఉద్యోగం పీకేశారు. జీతాలొస్తేనే అంతంత మాత్రంగా ఉన్నాయి బ్రతుకులు. క్రొత్తగా ఉద్యోగం దొరకటం అసంభవం. ఈ పరిస్థితిలో ఉన్న ఒక్క ఆధారం పోతే ఎలా బ్రతకను? ఏం పెట్టి పోషించను నా పెళ్ళాం పిల్లల్ని?"

"మీరు సచ్చిపోతే ఈ సిక్కు ముడి ఇడి పోద్దా, బాబూ? మీ ఆడోరు, పిల్లలు రోడ్డున ఆడిపోరా, బాబూ?"

సీతారాం బదులు చెప్పలేదు.

బిచ్చగాడు ఒక క్షణం ఆలోచనలో పడ్డాడు. తల పంకించా డొకసారి.

"నాతో మీ రొక్కసారి కాదనకుండా కూడా రండి, బాబూ! ఆ తర్వాత మీ ఇట్టవొచ్చినట్లు సేయండి."

అతని మాటని కాదనలేకపోయాడు. ఈ ముష్టివా డేదో మాయల మరాఠీలా ఉన్నా డనుకున్నాడు. మంత్ర ముగ్ధుడిలా అతన్ని ఫాలో అయ్యాడు.

మెయిన్ రోడ్డు మీద నడుస్తున్నారు—ముందు బిచ్చగాడు, అతని వెనక సీతారాం. ఎక్కడికని అడగ లేదు అతగాడిని. ఆ బిచ్చగాడి వెనక వెళ్ళడం అతనికే ఆశ్చర్యంగా ఉంది. అయినా వెళ్తున్నాడు.

"ఎప్పు డేటి సెయ్యాలో ఆడికి బాగా తెలుస్తది, బాబూ!" చేతి కర్రను ఆకాశం వైపు చూపిస్తూ అన్నాడు పెద్ద వేదాంతిలా, నాలుగు వేదాలవీ ఔపోసన పట్టేసిన వాడిలా!!

సీతారాం మాట్లాడలేదు. ఆమాత్రం సూక్తులు అతనికీ తెలుసు. ఆత్మహత్య చేసుకునే వాళ్ళు ఆ మాత్రం జ్ఞానం లేక కాదు. మనసు నీర సించేసి, అలిసిపోయినట్టయి, చావులో అంతకన్నా ఎక్కువ సుఖం లభిస్తుందేమో చూద్దామని దాన్ని ఆశ్రయిస్తారు. ఆత్మహత్య చేసుకున్న వాడు కనీసం ఒక్కడయినా తిరిగి బ్రతికొచ్చి చెబితే గాని మనకి తెలియదు ఆత్మహత్య తరవాత సుఖంగా, హాయిగా ఉంటుందో లేదో?!!

"పుట కిచ్చినోడిదే, బాబూ, పెంచే బాద్దెతకూడా. కట్టపడటానికి మనం తయారుగుంటే ఆడే సూపిత్తాడు దారి. కంగారు పడిపోకండా ఆడి లీలల్ని సూసే వోపికుండాల! ఆడి కిత లరదం సేసుకుంటా నికి నిదానం కావాల, బాబూ! పుట్టుకతోనే మాకీ కుష్ఠు రోగాన్నిచ్చాడు, బాబూ, బగమంతుడు. ఏం సెయ్యమంటారు, బాబూ? సచ్చిపోటానికి మన మెవరం? పుట్టకిచ్చినోడికే, బాబూ, తీసుకెల్లే ఆది కారం..." అత నింకా ఏదో చెబుతూనే ఉన్నాడు. సీతారాం చెవులు పనిచేయడం మానుకున్నయ్.

అంతలో వీధి దీపం వచ్చింది.

అతన్ని దీపం వెలుగులో పరీక్షగా చూశాడు సీతారాం. అతని రూపు చూసి ఒళ్ళు గగుర్పొడిచింది. మనసు విలవిల ఖాడిపోయింది.

వంతెన మీద బిచ్చగాడని గుర్తించాక అతని రూపు రేఖలకోసం పరీక్షగా చూడలేదు సీతారాం. అతగాడు తను కుష్ఠురోగినని చెప్పేక చూశాడు.


**VENUS TUTORIAL COLLEGE**

(వీనస్ ట్యుటోరియల్ కాలేజి, మద్రాసు

53-A, USMAN ROAD, T. NAGAR,
MADRAS - 600 017. (Near Panagal Park)

**ANDHRA MATRICULATION (MARCH — 1979)**
(Boys & Girls) — (English — Telugu Media)

**BANARAS MATRICULATION (MARCH — 1979)**
(Girls — English Medium only)

**CLASSES IN FULL SWING ! JOIN AT ONCE !**

Dr. Y. RAMOJI RAO, M.A., M.Ed., Ph.D.,
PRINCIPAL.



అనన్య సామాన్య ప్రచారం గల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక



**దంత వైద్యులు చెబుతున్నారు:**

చిగుళ్ల బాధలు, దంతక్షయం అరికట్టడానికి,
నియమానుసారంగా పళ్లను బ్రష్ చేసుకొని,
చిగుళ్లను మాలిష్ చేసుకోవాలి.

**ఫోర్‌హేన్స్ టూత్ బ్రష్ వాడండి.**
**ప్రత్యేకంగా రూపొందించబడిన**
**ఫోర్‌హేన్స్ డబుల్-యాక్షన్ టూత్ బ్రష్**
**మీ పళ్లను శుభ్రపరచడంతోపాటు చిగుళ్లను**
**మాలిష్ కూడా చేస్తుంది.**




పళ్లను బ్రష్ చేసుకోవడానికీ, చిగుళ్లను మాలిష్ చేసుకోవడానికీ ఫోర్‌హేన్స్ పద్ధతి నేర్చుకోండి. "పళ్లు, చిగుళ్లను గురించి తీసుకోవలసిన శ్రద్ధ" అనే రంగుల పుస్తకం ఉచితంగా కావాలంటే ఈ చిరునామాకు వ్రాయండి: ఫోర్‌హేన్స్ డెంటల్ అడ్వయిజరీ బ్యూరో, డిపార్ట్‌మెంట్ నెం. B 9-185 పోస్టు బేగ్ 11463, బొంబాయి 400 020. ఏ భాషలో కావాలో వ్రాయండి.

**ఫోర్‌హేన్స్**

డబుల్-యాక్షన్ టూత్ బ్రష్
—దంత వైద్యునిచే సృష్టింపబడిన
ఫోర్‌హేన్స్ టూత్ పేస్టుకు సరియైన జోడి.

495F-152 TE

అప్పటి వరకు తన కష్టసుఖాలు వెళ్ళబుచ్చుకున్నది ఒక కుష్ఠు రోగి ముందర అని తెలియగానే అతని మెదడు స్తంభించింది.

ఆశ్చర్యం! తను వెళ్తున్నది ఒక కుష్ఠు బిచ్చగాడి వెనక అని తెలిసినా సీతారాం అశక్తుడు గానే ఉండిపోయాడు. వెనక వెళ్తానే ఉన్నాడు హిప్నొటైజ్ వేయబడినట్లు.

"మడిసి జల మంటే కట్టాలుంటయ్, సుకాలూ ఉంటాయి, బాబూ! సుకమొత్తే ఎగిరి పడకూడదండి. కట్టమొత్తే కూలబడిపో కూడదండి. అయ్యా ఇయ్యా ఉండే మీరే అట్టా గయిపోతే ఒక్క కట్టాల కోసమే పుట్టిన మాలాటోళ్ళు ఏటయి పోవాల, బాబూ? ఇయ్యాల కట్ట మనుబవిత్తే రేపో మాపో సుకమొత్తా దన్న ఆశ మీ కుండొచ్చుగాని మా కేటి, బాబూ? పుట్టింది మొదలు సచ్చేదాకా మా బతుకులు కట్టాలే అని ముందే తెలిసిపోయినా బతుకుతుంటాం, బాబుగారూ.

మన పేనాలు మనం తీసుకుంటే వచ్చే జలమలో ఇచ్చేత్తాడంటండి బగమంతుడు. అందుకని ఆడి కేకకోసం పడిగాపులు పడి సూత్తాం గాని సచ్చిపోటానికి పెయత్నం సేయమండి. ఒక సోట ఉద్యోగం పోతే, ఆడు మీకు ఏరే సోట ఏర్పాటు సేసే ఉంటాడండి. అందరికీ ఆదరువుంచుతాడు, బాబూ. కాకపోతే ఎతుక్కునే బాద్దెత మన దండి. గుండె దైర్నం తెచ్చుకుని ఎతకండి. అదే దొరుకుతాది ఉద్దోగం." సీతారాం నోట మాట లేదు. ఆశ్చర్యంగా వింటున్నాడు బిచ్చగాడి మాటల్ని.

ఒక పాడుబడిన డాబా ముందు ఆగేడు బిచ్చగాడు.

"అయ్యగారూ, మీ రో పాలు ఇక్కడ నిలబడండి. నే నిప్పుడే వత్తా" అంటూ ఆ ఇంట్లోకి వెళ్ళాడు.

జరుగుతున్నది కలో నిజమో అర్థం కావటం లేదు సీతారాంకి.

అయిదు నిమిషాల్లో వచ్చాడు బిచ్చగాడు. చేతిలో చిన్న గుడ్డ సంచీ ఉంది.

"బాబూ! ఇది నేను ఇన్నాళ్ళూ దాసుకున్నది, బాబూ! ఈ డబ్బు మీ కాడ ఉంచండి, బాబూ! అవసరాని కుంటది. నేను కుష్ఠువాడినే కాని డబ్బు మంచిదే, బాబూ! ఎవర్నీ మోసం చేసి సంపాదించింది కాదు, బాబు గారూ ..."

సీతారాం కళ్ళలో నీళ్ళు తిరిగాయ్.

ఆ కుష్ఠువాడిలో ఒక అపురూప సౌందర్యమూర్తి కనిపించాడు—అతని కళ్ళకి.

అప్రయత్నంగా అతనికి చేతులెత్తి నమస్కరించాడు.

"వద్దు. నాకు ఈ డబ్బుకన్నా చాలా విలువైన దాన్నిచ్చావ్. నా లోంచి పిరికితనం పారిపోయింది. నే నిక చావాలని ప్రయత్నించను! బతికి సాధిస్తాను! రేపుకోసం—ప్రతి ఉదయంకోసం బతుకుతాను" అంటూ ఇంటి వైపు పరిగెత్తాడు సీతారాం.

బిచ్చగాడి కళ్ళనిండా ఆనంద బాష్పాలు నిండాయి.

ఒక ఇంటి దీపం ఆరిపోబోతుంటే, దానికి ఆయువు పోసిన ఆ కుష్ఠు బిచ్చగాడు కారణజన్ముడే అయి ఉండాలి. అతను కుష్ఠువాడ్ని కదా అని అంతకు ముందే ఆత్మహత్య చేసుకుని ఉంటే, ఈ కథ ఎలా నడిచేదో మరి ???

*




ఆంధ్రప్రదేశ్ కు డిస్ట్రిబ్యూటర్లు : మహవీర్ ఏజన్సీస్, తిలక్ రోడ్, హైదరాబాద్–1. ఫోన్: 221198